సాక్షి తిరుపతి

శుక్రవారం । 26 । జనవరి । 2024

I



మొబైల్‌హంట్‌తో సత్ఫలితాలు

మొబైల్ హంట్ వాట్సాప్ ద్వారా రూ.72 లక్షలు విలువజేసే సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. - IIలో



నిర్భయంగా ఓటు వేయండి

ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. - IIలో



టీటీడీ పరిధిలోకి రాజనాలబండ

దేవదాయ శాఖ అధికారులు రాజనాలబండ ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొన్తూ ఉత్తర్వులు జారీ చేశారు. - IIలో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,991 మంది స్వామివారిని దర్శించుకోగా 21,959 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.57 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

గణతంత్ర వేడుకల రిహార్సల్స్



కవాతులో పాల్గొన్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న శుక్రవారం గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి రిహార్సల్‌లో పాల్గొని కవాతు నిర్వహించే అధికారులకు పలు సూచనలు చేశారు. పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన ట్రైనింగ్ ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్ మొదటగా అతిథికి గౌరవ వందనం సమర్పిస్తారు. అనంతరం డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

శాస్త్రోక్తం.. సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం(యాదమరి): స్థానిక శ్రీ వరదరాజులస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా వ్రతాన్ని అర్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వ్రతాన్ని ఆచరించారు.

క్యాన్సర్‌పై సమరం

• పేదోడికి అంతర్జాతీయ వైద్యం



"క్యాన్సర్ చికిత్స కోసం మన రాష్ట్రానికి చెందిన ఎవరూ కూడా వేరే ప్రాంతానికి వెళ్లకూడదు. పేదలు, అట్టడుగు వర్గాల వారి కోసం ప్రపంచస్థాయి వైద్య సౌకర్యాలతో ఆస్పత్రి కావాలి".. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్న మాటలు ఇవి. ఆయన లక్ష్యం మేరకు శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాల చెంత తిరుపతిలో స్విమ్స్ యూనివర్సిటీకి అనుబంధంగా శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ రూపుదిద్దుకుంటోంది.



శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ భవన నమూనా

క్యాన్సర్.. మనిషిని తినేస్తుంది.. ఎప్పుడు.. ఎందుకు.. ఎలా వస్తుందో తెలియదు. వయసు, లింగ భేదంతో సంబంధం లేకుండా మనిషి శరీరంలో వైరస్ చేరి చంపేస్తుంది. అయితే మన దేశంలోని పలువురు సెలబ్రిటీల ముందు క్యాన్సర్ ఓడిపోయింది. వారిలో ఎక్కువమంది అమెరికాలో చికిత్స పొందారు. మరి పేదల పరిస్థితి ఏంటి? మన రాష్ట్రంలో వేలాది వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. అయితే క్యాన్సర్ మహమ్మారిపై అట్టడుగు వర్గాల ప్రజలు కూడా విజయం సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. ఆయన ఆలోచనల నుంచి పురుడుపోసుకున్నదే తిరుపతిలోని శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ.

- క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో తిరుపతిలో ఆస్పత్రి ఏర్పాటు
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో నిర్మిస్తున్న టీటీడీ
- వెంకన్న పాదాల చెంత స్విమ్స్ అనుబంధంగా ప్రత్యేక వైద్యశాల
- 14 విభాగాలతో మార్చి చివరికి ప్రారంభించే దిశగా పనులు వేగవంతం

సాక్షి, తిరుపతి డెస్క్: సమాజాన్ని పట్టిపీడిస్తున్న అత్యంత ప్రమాదకారి క్యాన్సర్. నూటికి 7 నుంచి 10 మంది వరకు క్యాన్సర్ కారక లక్షణాలు కలిగి ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. రాయలసీమ జిల్లాల్లో నూటికి 10 నుంచి 15 మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. అయితే శ్రీమంతులు మాత్రమే క్యాన్సర్‌కు వైద్యం చేయించుకునే రోజులు ఇవి. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. దాదాపు 4000 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. వెయ్యి రూపాయలకు మించి ఖర్చయ్యే వైద్యాన్ని ఆరోగ్యశ్రీలోకి చేర్పించారు. పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పేదవాడికి కూడా అంతర్జాతీయ స్థాయిలో క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ఆసుపత్రిని నిర్మించాలని సంకల్పించారు. టీటీడీ సహకారంతో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ (ఎస్‌బీఐఓ)ని నిర్మిస్తున్నారు. సీఎం ఆదేశాలు ఇచ్చిన 8 నెలల కాలంలోనే పనులు దాదాపు పూర్తి చేసుకున్నాయి.

క్యాన్సర్ ఏదైనా.. ఇక చికిత్స ఇక్కడే

రాష్ట్రంలో ఇప్పటివరకు మెడిసిన్, రేడియేషన్, సర్జికల్ ఆంకాలజీలు, న్యూక్లియర్ మెడిసిన్, రేడియో డయాగ్నస్టిక్, ఆంకో పెథాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీ వంటి క్యాన్సర్లకు మాత్రమే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఇతర క్యాన్సర్‌కు ఇప్పటివరకు రాష్ట్రంలో వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. ఇలాంటి వైద్య పరీక్షలు చేయాలంటే ఢిల్లీ ఎయిమ్స్, టాటా మెమోరియల్ ముంబయి, చెన్నై అడయార్ వంటి ఆస్పత్రులకు శాంపిల్స్ పంపించాల్సిన దుస్థితి ఉండేది. అక్కడి నుంచి రిపోర్టు వచ్చేవరకు నెలల తరబడి రోగులు నిరీక్షించక తప్పేది కాదు. ఇప్పుడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆస్పత్రిలోనే అన్నిరకాల క్యాన్సర్లకు వైద్య చికిత్స అందుబాటులోకి రానుంది.

14 రకాల క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్స

టీటీడీ నిర్మిస్తున్న శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ (ఎస్‌బీఐఓ) ఆస్పత్రిలో 14 రకాల క్యాన్సర్ విభాగాలతో నిర్మిస్తున్నారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, పెయిన్ అండ్ ప్యాలియేషన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్, జెరియాట్రిక్ ఆంకాలజీ, జీనోమిక్ లేబొరేటరీ, ప్రివెంటివ్ ఆంకాలజీ, క్యాన్సర్ రిజిస్ట్రీ వంటి రాష్ట్రంలో ఎక్కడా లేని క్యాన్సర్ విభాగాలు ఇక్కడ అందుబాటులోకి తీసుకురానున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం పీడియాట్రిక్ ఆంకాలజీని ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. క్యాన్సర్ నిర్ధారణ కోసం ఇక చెన్నై, ముంబయి, ఢిల్లీలోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంది. మరో 60 రోజుల్లో ఆసుపత్రిని ప్రారంభించేలా శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.150 కోట్లతో ఆస్పత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని అభివృద్ధి చేయడంతో పాటు రూ.200 కోట్ల విలువైన అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కోసం వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఏడు అంతస్తుల భారీ భవన నిర్మాణాన్ని ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో 400 బెడ్ల సామర్థ్యంతో 50 ఐసీయూ, ఎనిమిది ఆపరేషన్ థియేటర్లు, 60 ప్రత్యేక గదులతో నిర్మాణం జరుగుతోంది. అలానే రేడియేషన్ విభాగం కోసం ప్రత్యేకంగా బంకర్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ భవనం

క్యాన్సర్ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



క్యాన్సర్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన మానస పుత్రికగా క్యాన్సర్ ఆసుపత్రికి శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించేందుకు కసరత్తు పూర్తిచేశాం. మొదటి దశలోనే క్యాన్సర్‌ను అరికట్టేందుకు స్కీనింగ్ ప్రక్రియ చేపట్టనున్నాం. దీనివల్ల రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో క్యాన్సర్‌ను కనుమరుగు చేయవచ్చు. ఈ ఆస్పత్రిని భవిష్యత్‌లో క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మార్చి చివరి నాటికి ఈ ఆస్పత్రిని ప్రారంభించాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు సాగుతున్నాయి.

– డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, ప్రత్యేక అధికారి, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ

సమాచారం

ఆసుపత్రి పేరు:	శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ
వెచ్చిస్తున్న ఖర్చు :	రూ.150 కోట్లు
భవన విస్తీర్ణం:	మూడు లక్షల చదరపు అడుగులు
భవనం ఎత్తు	7 అంతస్తులు
బంకర్ బ్లాక్ (రేడియేషన్ విభాగం కోసం)	2 అంతస్తులు
వైద్య పరికరాల కోసం	రూ.200 కోట్లు
బెడ్ల సామర్థ్యం	400
ప్రత్యేక గదులు	60
మొత్తం వైద్యులు	54 మంది
నర్సులు	96 మంది
పారామెడికల్ స్టాఫ్	51 మంది
పరిపాలనా సిబ్బంది	40 మంది
ఇతర సిబ్బంది	70 మంది

ఆంకాలజీ విభాగాలు

ప్రస్తుతం స్విమ్స్‌లో ఉన్న విభాగాలు మొత్తం	4
మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్	
కొత్తగా ఏర్పాటు కానున్న ఆంకాలజీ విభాగాలు	10
రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని, ఇక్కడ మాత్రమే ఏర్పాటు చేస్తున్న విభాగాలు	7
బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, పెయిన్ అండ్ ప్యాలియేషన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్, జెరియాట్రిక్ ఆంకాలజీ (60 సంవత్సరాలు పైబడిన వారి కోసం), జీనోమిక్ లేబొరేటరీ, ప్రివెంటివ్ ఆంకాలజీ, క్యాన్సర్ రిజిస్ట్రీ.	
ఇంకా ఏర్పాటు చేస్తున్న విభాగాలు పీడియాట్రిక్ ఆంకాలజీ, ఆంకో పెథాలజీ, రేడియో డయాగ్నస్టిక్	

ప్రస్తుతం స్విమ్స్‌లో ఏటా నమోదవుతున్న ఓపీ(మూడు విభాగాలకు)లు

మొత్తం ఓపీలు	50,000
ఇన్ పేషెంట్	12,000
రేడియోథెరపీ	2000
సర్జరీలు	4000
కీమోథెరపీ	13,000

నెలవారి నమోదు అవుతున్న ఓపీ వివరాలు

2022 డిసెంబర్‌లో..

సర్జికల్ ఆంకాలజీ ఓపీ	1,250
అడ్మిషన్లు	130
మెడికల్ ఆంకాలజీ ఓపీ	2,500
అడ్మిషన్లు	800
రేడియేషన్ ఆంకాలజీ ఓపీ	195
అడ్మిషన్లు	200
ఐసీయూ బెడ్లు	50

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'గా ప్రభుత్వం





తిరుపతిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, టీటీడీ చైర్మన్ భూమన, తిరుచానూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

- జిల్లా అంతటా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- పొదుపు సంఘాల సభ్యులకు 4వ విడత చెక్కుల పంపిణీ

తిరుపతి అర్బన్: జిల్లా అంతటా వైఎస్సార్ ఆసరా పండుగ సంబరాలు కొనసాగుతున్నాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో పొదుపు సంఘం మహిళలతోపాటు స్థానికులు పెద్దఎత్తున విచ్చేస్తున్నారు. 4వ విడతలో భాగంగా జిల్లాలోని 33,757 పొదుపు సంఘాల్లోని 3,19,049 మంది సభ్యులకు రూ.298.67 కోట్లు రుణాలు మాఫీ జరిగాయి. దీంతో పొదుపు సంఘాల్లోని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా పొదుపు సంఘం సభ్యులకు చెందిన గ్రూపులకు చెక్కును అందిస్తున్నారు. గురువారం తిరుపతిలోని జీవకోనలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డితోపాటు మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరితా పాల్గొని సంఘ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి రూరల్ పరిధిలో తిరుచానూరు, రామచంద్రాపురంలో తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మోహిత్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. అదే విధంగా నాయుడుపేటలోని వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గౌరవంగా బతుకుతున్నాం..



నా పేరు శిరీష. తిరుపతిలోని గోవింద నగర్‌లో నివాసం ఉంటున్నాం. మాది నాగాలమ్మ పొదుపు సంఘం. గత నాలుగేళ్లుగా మా సంఘానికి పొదుపు రుణాలు మాఫీ అవుతున్నాయి. నాలుగో విడతలో రూ.68 వేలు జగనన్న ప్రభుత్వం మాఫీ చేసింది. ఆ డబ్బులతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఎంతో గౌరవంగా బతుకుతున్నాం. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – **శిరీష, తిరుపతి, పొదుపు సంఘం సభ్యురాలు**

రుణమాఫీ అయింది..



మేము తిరుపతిలోని శ్రీనగర్‌లో నివాసం ఉంటున్నాం. మాది ప్రగతి పొదుపు సంఘం. మా సంఘానికి రూ.1.60 లక్షలు రుణమాఫీ జరిగింది. వరుసగా నాలుగు సార్లు మా సంఘానికి రుణమాఫీ అయ్యాయి. నేను మా కుటుంబ సభ్యులకు, పిల్లల చదువులకు డబ్బులు ఇస్తున్నా. ఎంతో సంతృప్తిగా ఉంది. మళ్లీ జగనన్న రావాలి. ఆయన వస్తేనే మహిళలకు మంచి జరుగుతుందని భావిస్తున్నాం.

– **శోభమ్మ, పొదుపు సభ్యురాలు, తిరుపతి**

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



ముస్తాబైన తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం

తిరుపతి అర్బన్: 75వ గణతంత్ర వేడుకలకు తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్ మరోసారి వేదిక కానుంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు. పలువురి అధికారులకు వారం రోజుల ముందే బాధ్యతలు అప్పగించారు. ప్రధానంగా డీఆర్‌డీఏ పీడీ జ్యోతి స్టాల్స్ ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను, మెప్మా పీడీ రాధమ్మకు శకటాల పర్యవేక్షణను కేటాయించారు. జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో 350 మంది అధికారులు అవార్డులు అందుకోనున్నారు. 20మందికి పైగా జిల్లా అధికారులు ఉన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ శుభం భన్సల్ చేతుల మీదుగా పలువురు అవార్డులను అందుకోనున్నారు. మరోవైపు 14 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా 10 జిల్లా ప్రగతి శకటాలను సిద్ధం చేశారు. ముందుగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పరమేశ్వర రెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

14 స్టాల్స్, 10 శకటాలు ఏర్పాటు..

గణతంత్ర వేడుకలు నేపథ్యంలో 14 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో విభాగానికి ఒక్కో స్టాల్‌ను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. అలాగే జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రదర్శిస్తూ 10 శకటాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా పోలీస్, విద్యాశాఖ, గృహనిర్మాణశాఖ, హెల్త్ డిపార్ట్‌మెంట్, దేవదాయశాఖ, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్(102), ఫ్యామిలీ డాక్టర్(104), ఎమర్జెన్సీ సర్వీస్(108) చెందిన స్టాల్స్, శకటాలను ప్రదర్శిస్తారు.

28న కోటలో సామాజిక సాధికార యాత్ర

- యాత్రను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్సీలు మేరిగ, బల్లి కల్యాణ్ చక్రవర్తి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లికల్యాణ చక్రవర్తి

కోట: మండల కేంద్రమైన కోటలో ఈ నెల 28న చేపట్టే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి పిలుపునిచ్చారు. గురువారం కోట పట్టణంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గూడూరు నియోజకవర్గంలోని మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. సామాజికంగా బడుగు, బలహీనవర్గాల వారికి 50 శాతం పదవులు ఇచ్చిన ఘనత ఆయనదే అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సామాజిక న్యాయాన్ని బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రూట్‌మ్యాప్‌పై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, సంపత్‌కుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, నాగూర్‌రెడ్డి, షనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెంగాళమ్మ ఆలయంలో మహాచండీ యాగం


యాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం మహాచండీ యాగం ఘనంగా నిర్వహించారు. ఈ పౌర్ణమికి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అయితే వారు కొన్ని అనివార్య కారణాల వల్ల యాగంలో పాల్గొనలేకపోయారు. వారి తరఫున ఆలయ పూజారులు యాగాన్ని వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండి సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి


సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్, కమిషనర్, అధికారులు


జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ హరిత, అధికారులు

- 53 వేల మంది 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడం శుభ పరిణామం
- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- ఓటు వేసి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోండి
- ఓటరు నమోదు అధికారి హరిత

తిరుపతి తుడా/కల్చరల్ : వచ్చే ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని కచ్చపి కళాక్షేత్రంలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ 1950 సంవత్సరంలో ఎన్నికల సంఘం ఏర్పాటైందని, 2011 సంవత్సరం నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులలో అన్నింటికంటే ముఖ్యమైనది ఓటు హక్కేనని అన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలన్న ముఖ్య ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించిందన్నారు. జిల్లాలో సుమారు 53 వేల మంది యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. అనంతరం ఓటరు నమోదు అధికారి డి.హరిత మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. యువ ఓటర్లు చైతన్యంతో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కులం, మతం, డబ్బులు చూడకుండా వందశాతం ఓటు వేస్తే మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 79 శాతం మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారని మిగిలిన 31 శాతం మంది కూడా వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు విధుల్లో అంకితభావంతో పనిచేసిన ఆర్‌డీఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో..

అంతకుముందు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద తిరుపతి ఆర్డీఓ, తహసీల్దార్, ఇతర ఎన్నికల అధికారులతో కలసి 14వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఓటర్ నమోదు, ఓటు హక్కు వినియోగంపై ర్యాలీని కమిషనర్ హరిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కచ్చపి కళాక్షేత్రం వరకు నిర్వహించారు. ర్యాలీలో స్మార్ట్ సిటీ చంద్రమౌళి, ఆర్డీఓలు ఏ.నిశాంత్ రెడ్డి, ఎం.కిరణ్ కుమార్, ఆర్.చంద్రముని, ఎన్.రవిశంకర్ రెడ్డి, శ్రీనివాసులు, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఏఈఆర్‌ఓలు రమేష్‌బాబు, ప్రమీళ, సుబ్రహ్మణ్యం, మునిశైలజ, భూపతి, సుబ్రమణ్యం, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు ఇస్తున్న మొబైల్ హంట్


ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, సిబ్బంది

- రూ.72 లక్షలు విలువ చేసే సెల్‌ఫోన్లు స్వాధీనం
- ప్రతి ఒక్కరూ ఓటు వేయండి
- జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా పరిధిలో పోగొట్టుకున్న రూ.72 లక్షలు విలువచేసే 400 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి కోసం మొబైల్ హంట్ వాట్సాప్ 9490617873 అప్లికేషన్స్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించామన్నారు. ఈ విధంగా గతంలో జిల్లావ్యాప్తంగా ఏడు విడతల్లో రూ.4.14 కోట్లు విలువచేసే 2,230 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం 8వ విడతలో గత నెలల వ్యవధిలో రూ.72 లక్షలు విలువ చేసే 400 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ 8 విడతల్లో మొబైల్ హంట్ వాట్సాప్ అప్లికేషన్ ద్వారా రూ.8.72 కోట్లు విలువ చేసే 2,630 ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. తిరుమల తిరుపతి సందర్శనానికి వచ్చే వేలాదిమంది భక్తులు బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొబైల్‌ఫోన్లను అధిక సంఖ్యలో పోగొట్టుకోవడం దొంగతనాలకు గురవడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టితోనే ఈ మొబైల్ హంట్ అప్లికేషన్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను త్వరగా రికవరీ చేసేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం సైబర్ సెల్ సీఐ రామచంద్రా రెడ్డిని ప్రశంసాపత్రంతో అభినందించారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ పాల్గొన్నారు. అనంతరం మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో గురువారం ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందిచే భారతీయ ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం అని అర్హులైన ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే బాధ్యత మన అందరిపై ఉందని పారదర్శకంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: వ్యక్తిని కిరాతకంగా రాయితో హత్య చేసిన కేసులో ఉమ్మడి కృష్ణా జిల్లా, పమిడి ముక్కల మండలం, చోరగుడికి చెందిన సి.రవికుమార్‌కు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు గురువారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర్‌రెడ్డి, కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య, కోర్టు కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలు ఇలా.. తిరుపతి రూరల్ పాడిపేట, వినాయకనగర్‌కు చెందిన ఎస్.నటరాజ్ తిరుచానూరు పరిధిలోని సరస్వతి నగర్‌లో చెత్త వస్తువుల సేకరణ వ్యాపారం నిర్వహించేవాడు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం, బత్తలపల్లికి చెందిన తుపాకుల ఆర్ముగం తన బంధువైన తిరుచానూరులో ఉన్న ఒక వ్యక్తి వద్దకు వచ్చాడు. ఆర్ముగం పాత ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర పాత వస్తువులను సేకరించి నటరాజుకు విక్రయించేవాడు. మద్యం సేవించి రాత్రి సమయాల్లో ఆ షాపు ఎదురుగానే నిద్రించేవాడు. నిందితుడు రవి కుమార్‌కు ఆర్ముగానికి తరుచూ గొడవలు జరిగేవి. 2021 డిసెంబర్ 21వ తేదీ రాత్రి ఆర్ముగం షాపు వద్ద నిద్రిస్తుండగా నిందితుడు రవి కుమార్ బండరాళ్లతో అతని తలపై బాది చంపాడు. తిరుచానూరు సీఐ సుబ్రమణ్యంరెడ్డితో పాటు సీఐలు సుధాకర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి కేసు దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీ, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ద్వారా నిందితుడు రవికుమార్ అని గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు రవికుమార్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

టీటీడీ పరిధిలోకి రాజనాలబండ


బోయకొండలో నిర్వహిస్తున్న, చండీ హోమం

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ వీరాంజనేయస్వామి ఆలయం, సమీపంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు టీటీడీ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో చరిత్రాత్మక ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు విశిష్ట కృషిచేశారని కొనియాడారు. తిరుపతి గోవిందరాజస్వామి టెంపుల్ డిప్యూటీ ఈఓ శాంతి, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం కలిసి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ తాళాలను టీటీడీ అధికారులకు అందజేశారు. ఆలయానికి చెందిన భూములు, బంగారు, వెండి ఆభరణాలతోపాటు ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు ఇక నుంచి టీటీడీ ఆధ్వ ర్యంలో జరుగుతాయన్నారు. ఈ మేరకు ఆలయ ఆదాయ వనరులు, ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ ఈఓ శాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యువెలరీ ఏఈఓ మణి, జనరల్ సెక్షన్ డిప్యూటీ ఈఓ శివప్రసాద్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ వెంకటరమణ, ల్యాండ్స్ ఎస్టేట్ విభాగం తహసీల్దార్ లలితాంజలి, టెంపుల్ ఇన్‌చార్జి భానుప్రకాష్ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో చండీ హోమం

బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి అభిషేక పూజలు చేశారు. పూర్ణాహుతి అనంతరం ఉభయదారులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

చెక్‌పోస్టులో రూ.3.50 లక్షలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మాల్యాద్రి

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టులో గురువారం ఉదయం ఒక వ్యక్తి నుంచి రూ.3.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మద్దెలమడుగు వద్ద నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా విజయవాడకు చెందిన శ్రీనివాసులు రావుకు చెందిన కారులో రూ.3.50 లక్షలు నగదు ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యాపార నిమిత్తం రాజంపేటకు డబ్బుతో వెళ్తున్నట్లు శ్రీనివాసులురావు తెలిపారన్నారు. అయితే నగదుకు సంబంధించి బిల్లులు అతని దగ్గర లేవని చెప్పడంతో స్థానికుల సమక్షంలో స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నగదుకు సంబంధించి తగిన రశీదు చూపిస్తే తిరిగి ఆ నగదును అతనికి అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు పెద్దమొత్తంలో నగదు రవాణా చేయవద్దన్నారు. అత్యవసరమైతే అందుకు సంబంధించిన ఆధారాలతో వెళ్లాలని సూచించారు. ఎస్ఐ మాల్యాద్రి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అత్తాకోడలు మృతి



లీలా రాణి, విజయఅను (ఫైల్)

పిచ్చాటూరు: రోడ్డు ప్రమాదంలో పిచ్చాటూరుకు చెందిన లీలారాణి(64), విజయఅను(28) దుర్మరణం పాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు పిచ్చాటూరులో ఉమాశంకర్ గుప్త, లీలారాణి దంపతులు గత 40 ఏళ్లుగా బుక్ స్టోర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం కంచిలోని వారి చిన్న కుమారుడు వినోద్, కోడలు విజయఅను, మనుమళ్లతో కలిసి ఉమాశంకర్ గుప్త దంపతులు కారులో బెంగళూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో రాయవేలూరు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లీలారాణి అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను రాయవేలూరులోని నరువ్య ఆస్పత్రికి తరలించగా, కాసేపటికే చికిత్స పొందుతూ కోడలు విజయఅను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉమాశంకర్ గుప్త తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. కుమారుడు వినోద్ చేయి విరిగింది. మనువళ్లు స్వల్ప గాయాలతో బయటపడినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై పిచ్చాటూరు వర్తక సంఘం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతులకు సంతాపం తెలపడంతో పాటు ఉమాశంకర్ గుప్త త్వరగా కోలుకోవాలని వర్తక సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు.

సత్యవేడులో విజయ బావుటా ఎగరేద్దాం


వరదయ్యపాళెంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న సత్యవేడు ఇన్‌చార్జ్, ఎంపీ గురుమూర్తి

- 27న తిరుపతిలో సత్యవేడు నియోజకవర్గ స్థాయి సమావేశం
- పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంపీ గురుమూర్తి

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల సమన్వయంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సత్యవేడులో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి పిలుపునిచ్చారు. గురువారం సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం మండలాల్లో పర్యటించిన ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 27న రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ, గనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన తిరుపతిలో జరిగే సత్యవేడు నియోజకవర్గ స్థాయి సమావేశానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం తాను తిరుపతి ఎంపీగా ఉపఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో సత్యవేడు నియోజకవర్గ ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. మళ్లీ ఇప్పుడు సీఎం జగనన్న మీ అందరిపై నమ్మకంతో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా తనకు పెద్ద బాధ్యతను అప్పజెప్పారని, మీ అందరి దీవెనలు అందించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి ప్రతి వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడు తిరుపతి నియోజకవర్గ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్, కార్యదర్శులు అబ్దుల్, లతీఫ్, శ్రీకాళహస్తీశ్వర ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు